# ఆ మూల సౌధంలో...

ఆ సాయంత్రం నుండి ప్రతాప్ తన పోలీసు ఉద్యోగాన్ని అయిదువందల సార్లు తిట్టుకున్నాడు. 'తప్పులు చేసేది దుర్మార్గులు, శిక్షలు పోలీసువాళ్లకి. శిక్షలంటే కోర్టువారు వేసేవే శిక్షలు కావు. ఈ మునిమాపు చీకట్లో, దారి కనబడని, దిక్కుతోచని కొండదారుల్లో, ఏ నరప్రాణీ కానరాని ఈ కోనల్లో, ఈ చలిలో పడి తిరగవలసిరావడం శిక్ష కాదా యేం? అక్కడకీ తను చెప్పాడు – 'కొండదేవరపాలెం పోలీసు ఔట్‌స్టేషన్‌కి చెబుతాను. వాళ్లు ఏ అట్టహాసం లేకుండా రైలుస్టేషన్‌కొచ్చి తీసుకెళతారు' అని. అలా కుదరదట, ఎవరికీ తెలియకుండా వెళ్లాలిట. రత్తయ్య పట్టుబడ్డాకనే అక్కడి పోలీసుస్టేషన్లో చెప్పాలిట. రైలుస్టేషన్ దగ్గర్నుంచి 'జస్ట్ వాకింగ్ డిస్టన్స్' అన్నాడు ఎస్పీ కాళ్లూపుకుంటూ. 'వాకింగ్' అంటే ఎంత? రోజుల తరబడి వాకింగా? రైల్‌స్టేషన్ పేరు చూస్తే 'కొండదేవరపాలెం రోడ్'. కానీ ఆ రోడ్ ఎంతకూ తరగదు. ఎన్ని మలుపులు తిరిగిందో లెక్కలేదు. అడుగుదామంటే మనిషి కనబడడు.

తను వస్తున్నట్టు రత్తయ్యకు ఉప్పందిందంటే అంతే సంగతులు. జైల్లోంచి పారిపోయి వచ్చినవాడు, ఆంధ్రా 'జాక్ ద రిప్పర్' పేరు కెక్కినవాడు. అవును మరి, ముప్పై ఇద్దరు ఆడవాళ్లను క్రూరంగా అనుభవించి, ఆ తరువాత భీకరంగా నరికేసానని బోనెక్కి స్వయంగా చెప్పుకున్నాడు. ఉరి తీయబోయేముందు ప్రాణం తీపికొద్దీ పారిపోయేడు. వాడెలా ఛస్తే తనకేం? రేదర్ చావకపోతే తనకేం? కొండల్లో, చిమ్మచీకటిలో చిక్కడిపోవాల్సి వచ్చిందనే తన బాధంతా. కొండ ప్రాంతాల పల్లెటూరి యువకుడి వేషంలో వెళ్లాలని ఎస్పీ గారి బోడి సలహా ఒకటి. అలవాటు లేని అంగీ కాళ్ల కద్దుపడుతోంది. కప్పుకున్న గొంగళి చలినాపలేకపోతోంది.

"నీకూ చలేస్తోందా?" అని అడిగాడు వెంట తీసుకొచ్చిన పెంపుడు కుక్కని. జవాబుగా అది మొరిగింది. పాపం, అదీ కష్టపడుతోంది. సన్నగా మంచు పడుతూండడంతో అప్పుడప్పుడు ఒళ్లు విదిలించుకుంటోంది. వర్షం కూడా ప్రారంభమయింది. రాత్రికి ఎక్కడో అక్కడ ఆశ్రయం దొరక్కపోతే తామిద్దరం చావడం ఖాయం.

ఇంకో గంటన్నరకి ప్రతాప్ కంటికి ఓ పెద్ద బంగళా కనబడింది. చుట్టూ పొలం. మధ్యలో కాంపౌండుగోడ, పాత ఇనుపగేటు, అంతకన్నా పాత సౌధం. చీకటిగా ఉంది. ఓ బుడ్డి దీపం అస్పష్టంగా వెలుగుతున్నట్టు కిటికీలోంచి కనబడుతోంది. ఏదో ఒక గూడు దొరికితే చాలనుకుని ప్రతాప్ గేటు తీసుకొని లోపలికి వెళ్లాడు. తలుపు తట్టిన కాస్సేపటికి లోపల అగ్గిపుల్ల గీసిన చప్పుడయింది. కొవ్వొత్తి కాంతి క్రమంగా దగ్గరయినట్టు అర్థమయింది. కిర్రుమంటూ తలుపు తెరుచుకుంది. నడి వయస్సు స్త్రీ. చేతిలో కొవ్వొత్తి బాగా ఎత్తి పట్టుకోవడంతో దాని కాంతిలో ఆమె సగం, సగం కనబడినట్లయింది. ఆమెలో ఒక హుందా ఉంది. తనను చూసి సంతోషించిందో, 'ఎందుకొచ్చిన గొడవరా ఇది' అన్నట్టు చూసిందో అతనికి తెలియరాలేదు.

" ఎవరు కావాలి?" అంది ముభావంగానే.

ప్రతాప్‌కి కాస్త బెరుకు తోచింది. గొంగళి తీసి చేతిమీదకు వేసుకుంటూ, "దారి తప్పిపోయి వచ్చాను. కనుచూపుమేరలో మీ ఇల్లు తప్ప మనుషులుండే ఆవాసం ఏదీ కనబట్టం లేదు. రాత్రికి తలదాచుకోనిస్తే..."

"...కూడా ఎవరూ లేరా?"

"...కుక్క తప్ప."

ఆమె ఒక్క క్షణం ఆలోచించినట్లయింది. "రండి, మా చేతనైనంత చేస్తాం" అంటూ పక్కకు జరిగి నిలబడింది. అతనూ, కుక్కా 'బతుకుజీవుడా' అనుకుంటూ లోపలికి జొరబడ్డారు.

నడవాలో బట్టలు దులుపుకొని హాలులోకి రాగానే అతని దృష్టి నాకర్షించినది – ఫైర్ ప్లేస్. హాలు పెద్దదే. పాతరకం జమీందార్ల కుటుంబం కాబోలు. గాజుబుడ్డి దీపాలున్నాయి కానీ ఎలక్ట్రిసిటీ ఉన్నట్టులేదు. ఫైర్ ప్లేస్ దగ్గిర ఎత్తు కుర్చీలో మరొక స్త్రీ కూచుని మంటకేసి చూస్తోంది. మంటల ఛాయలు, మెరుపులు ఆమె ముఖంపై నర్తిస్తున్నాయి. ఆమెను చూడగానే ఎక్కడో చూసినట్టనిపించింది. వెంటనే స్ఫురించింది కూడా – తనను లోపలికి రానిచ్చినావిడ, ఈవిడ అచ్చం ఒక్కలాగే ఉన్నారు. అదే శరీరపు రంగు, అదే సౌష్టవం, అదే వయస్సు – నలభై అయిదు ప్రాంతాల్లో! కవలలయివుంటారు. బట్టలు కూడా ఒక్కలాటివే వేసుకున్నారు. అంతలో ఆమె వంగి, ఫైర్ ప్లేసులోని మంట ఎగదోస్తోంది. ప్రతాప్ అడుగుల సడి వినగానే వెనక్కి తిరిగి,

"కుర్చీ మంట దగ్గరగా లాక్కోండి. చలి కాస్త తగ్గాక భోజనం చేద్దురు గాని" అందామె. కంఠస్వరం కూడా ఇద్దరిదీ ఒకేలాగ ఉంది.

ఇంతలో తలుపు తెరిచినామె వేడి టీ, బిస్కట్లు తెచ్చింది. "ఇది తాగుతూ ఉండండి, భోజనం రెడీ చేస్తాను." అని మళ్లీ లోపలికి వెళ్లింది.

కుర్చీలో ఉన్నామె తనను కన్నార్పకుండా చూస్తుండడం చాలా ఇబ్బందికరంగా తోచింది అతనికి. బయటంతా చిమ్మచీకటి, వర్షం. లోపల గగుర్పాటు కలిగించే వాతావరణం. పెద్ద బంగళాలో ఒంటరిగా ఉన్న ఆడమనుషులిద్దరు. పనివాళ్లూ లేరు. 'వీళ్లు మనుషులా? పిశాచాలా?'

వాళ్లిద్దరూ ఒకేలా ఉండడం, ఒకేలా డ్రస్ చేసుకోవడం చాలా భయం గొల్పుతోంది. ఆ డ్రస్ కూడా చాలా వింతగా ఉంది. ఎవరో కావాల్సినవాళ్లు వస్తారని అలంకరించుకొని ఎదురుచూస్తూ ఉన్నట్టుంది. యవ్వనంలో ఉన్నవాళ్లు అలాటి బట్టలు వేసుకున్నా భరించగలమేమో గానీ ఈ నడివయస్సు కన్యలు ఆ డ్రస్సులో కనబడడం వెగటుగా తోచింది.

తనకు తాను ధైర్యం చెప్పుకోడానికి ఏదో మాట్లాడాలని, "కొండదేవరపాలెం ఎంత దూరం ఉంటుందంటారు?" అన్నాడు.

"పెద్ద దూరమేమీ కాదు. దారి తెలిసినవారికి వెళ్లడం కష్టమేమీ కాదు. కానీ కొత్తవాళ్లు తెలివితక్కువగా ఎవర్నీ అడక్కుండా వచ్చి చిక్కడిపోతారు." అందామె నిర్లిప్తంగా.

మాట మార్చాలని, "ఇక్కడ మీకు మరీ ఏకాంతంగా ఉండదూ," అన్నాడు ప్రతాప్.

"మేం ఇక్కడే పుట్టాం. మా కమలకీ, నాకూ కూడా ఎక్కడికీ వెళ్లాలనిపించదు."

"ఆవిడ పేరు కమలా, మీ పేరు?"

"విమల... ఇదిగో మీ భోజనం రెడీ అయినట్టుంది. కానీయండి." అందామె కమల కంచం తెస్తుండడంతో.

"మీ భోజనం?".

"మాదయిపోయింది. మీరు భోజనం చేయండి."

భోజనం కమ్మగా ఉంది. కానీ అన్నం తింటున్నంత సేపూ ఆ అక్కచెల్లెల్లిద్దరూ ఉలుకూ, పలుకూ లేకుండా తనకేసే చూస్తుండడం అదోలా తోచిందతనికి. ఇద్దరూ చెరో కుర్చీలో సరిగ్గా ఒకేలా కూర్చున్నారు. భోజనం కాగానే కమల తనవైపుకి కుర్చీ జరుపుకోగానే, విమల కూడా జరుపుకుంది. చాలా ఇబ్బందికరంగా ఫీలయ్యాడు ప్రతాప్.

"మీ పేరు..." అడిగింది కమల చాలా ఆసక్తిగా.

"ప్రతాప్"

కమల కొంటెగా నవ్వింది. ఎందుకో అర్థం కాలేదు ప్రతాప్‌కి. తనూ ఏదో ప్రశ్నలడిగితే వాళ్ల

ప్రశ్నలు తప్పించుకోవచ్చనిపించింది.

"ఈ లంకంత ఇంట్లో మీ ఇద్దరే ఉంటారా? నౌకర్లు, చాకర్లు కనబడటం లేదు."

"నౌకర్లెందుకు? మాకు పాడి ఉంది, పెరడు వుంది. పాలు, పెరుగు, కూరగాయలు - దేనికీ లోటులేదు. నెల్లాళ్లకోసారి సంతకెళితే తక్కినవన్నీ దొరుకుతాయి. మా పన్లు మేమే చేసుకోగల దార్ఢ్యం ఉంది. ఇంకెందుకు పనివాళ్లు?"

ఇలాగే కొంతసేపు సంభాషణ సాగింది. ప్రతాప్ పోలీసుబుద్ధికి కొన్ని విషయాలు అర్థమయ్యాయి. పెద్ద హాలు, పెచ్చులూడిపోయినా గంభీరంగా ఉన్న గోడలు, ఇవన్నీ చూస్తే ఒకప్పుడు అది బాగా బతికినవారి కుటుంబమే. ఇంటిసభ్యులందరూ ఒక్కొక్కరిగా మరణించి ఉంటారు, కానీ ఇద్దరూ అక్కచెల్లెళ్లు మిగిలిపోయారు. అందగత్తెలే. చిత్రమేమిటంటే ఇద్దరూ తనతో మాట్లాడుతున్నా, ఒకరితో ఒకరు మాత్రం మాట్లాడుకోవడం లేదు. కమల మాట్లాడుతున్నప్పుడు ఏదో నర్మంగా మాట్లాడుతున్నట్టుంది.

"భోజనం పెట్టి పుణ్యం కట్టుకున్నారు. ఏమీ అనుకోకపోతే, ఇక్కడెక్కడైనా సోఫాలోనో, బెంచీమీదో నడుం వాలుస్తాను. తెల్లారగానే వెళ్లిపోతాను." అన్నాడు ప్రతాప్ అభ్యర్థిస్తూ.

"బెంచీ ఏం ఖర్మ, పైన పడగ్గది ఉందిగా, అక్కడే పడుక్కోండి." అంది కమల చటుక్కున.

కాస్సేపటికి ప్రతాప్ పక్కమీద దొర్లుతున్నాడు. ఏమిటో అంతా మిస్టీరియస్‌గా ఉంది. పక్క శుభ్రంగా వేసి ఉంది, ఎవరో వస్తారని ముందే తెలిసినట్టు. చుట్టూ చీకటి, బుడ్డిదీపాలు, బైట వానహోరు. అతనికి సడన్‌గా దయ్యాల కథలు గుర్తొచ్చాయి. ఆ కథల్లో ఇలాగే 'ఒంటరి మేడలో ఆగంతకుడికి ఓ రాత్రి ఆతిథ్యం లభిస్తుంది. విందు, పొందు దొరుకుతుంది. పొద్దున్న లేచి చూస్తే శ్మశానంలో పడుక్కొని ఉంటాడు. దారినపోయే రైతు నడిగితే ఆ చోట్లో వందేళ్ల క్రితం ఇద్దరమ్మాయిలు మోసగింపబడి, ఆత్మహత్య చేసుకున్నారని చెప్తాడు.' రేప్పొద్దున తనకీ అలాగే జరుగుతుందేమో. 'కానీ ఆ కథల్లో కన్నెపిల్లలుంటారు, ఇలా వృద్ధకన్యలుండరు. అందుచేత వీళ్లు దెయ్యాలు కారు.' అనుకొని, తన లాజిక్‌కి తనకే నవ్వొచ్చింది ప్రతాప్‌కి.

వర్షం కిటికీ తలుపుమీద దరువు వేస్తూండగా క్రమంగా నిద్రపట్టింది. ఎంత రాత్రయిందో గానీ కుక్కపిల్ల సన్నగా గుర్రు మనడంతో మెలకువ వచ్చింది. చూస్తే ఎదురుగా కమల, చేతిలో చురకత్తితో. పొడవబోతోంది. కానీ మొహంలో ద్వేషం కనబడటం లేదు. కత్తి ఎత్తి దింపేలోపున ప్రతాప్‌కి పూర్తి మెలకువ వచ్చేసింది. చటుక్కున ఆమె చెయ్యి పట్టుకొని మెలి తిప్పాడు. కత్తి కిందపడింది.

"ఏమిటిది?" అన్నాడు ఖంగారుగా. కుక్క అప్పటికే అతని దగ్గరికి చేరింది రక్షణ ఇవ్వడానికన్నట్లు.

"అవును మరి. నువ్వు నా దగ్గరనుండి వెళ్లిపోకుండా ఉండాలంటే ఇదొక్కటే మార్గం" అంది కమల తొణక్కుండా.

"అలా ఎవరన్నారు?"

"విమల అలాగేగా చేసింది. కానీ తమాషా ఏమిటంటే వారం రోజుల క్రితం వచ్చినవాణ్ని చూసి నువ్వనుకొని పొరబాటుపడింది. కానీ నేను నిన్ను చూడగానే గుర్తు పట్టేసాను. నువ్వే రాజావి. విమలకి తెలియకూడదని వేరే పేరు చెబుతున్నావు కదూ" చిరునవ్వు నవ్వుతూ కమల అతని బుగ్గమీద చిటికేసింది. ప్రతాప్‌కి వెన్నులో చలి పుట్టింది.

"నా పేరు రాజా కాదు, ప్రతాప్" అన్నాడు వణుకుతున్న గొంతుతోనే.

కమల అతని పక్కన చేరింది. గడ్డం పట్టుకుంది. "నాకు తెలుసు. నువ్వు మా ఇద్దరిమీదా అలిగేవు. అలిగి ఊరు విడిచి వెళ్లిపోయావు. పొరబాటు మాదే. మేం ఇద్దరం కలిసి నిన్ను తికమక పెట్టి ఆటలాడించాం. కవలలం అని నీకు తెలియదుగా. మేం ఇద్దరం ఒక్కళ్లమే అనుకున్నావు. ప్రేమలో పడ్డావు. తర్వాత మేము వేరే, వేరే అని తెలిసేటప్పటికి నీకు కోపం వచ్చింది.."

"..నా కిదేమీ అర్థం కావటం లేదు."

"అప్పుడూ ఇలాగే అన్నావు. 'మీ ఇద్దరూ కలిసి నాతో ప్రేమ నటించారు, తమాషా పట్టించారు.

నేను నిజంగా ప్రేమించిందెవరినో, నన్ను ప్రేమించిందెవరో తెలియదు. అసలు ప్రేమించారో లేదో కూడా తెలియదు.' అంటూ కోపంగా వూరు విడిచి వెళ్లిపోయావు. కానీ నిన్ను నిజంగా ప్రేమించింది నేనే. విమలదంతా నటన. అసలు మా పోలిక ఆసరా తీసుకొని నిన్ను ఏడిపించాలన్న ఐడియా దానిదే. నాది స్వచ్ఛమైన ప్రేమ కాబట్టే నిన్ను చూడగానే గుర్తుపట్టగలిగాను. దారి తప్పిపోయిన వాడిలా నటిస్తూ వచ్చావు, ఎవరు నిన్ను గుర్తుపడతారో చూదామని. నిజమైన ప్రేమికురాలినే కాబట్టే నేను..."

"...నేను రాజా నయితే, నీకంటే ఇంకా పెద్దవాడిగా ఉండాలిగా" అంటూ ప్రతాప్ మాటకడ్డువచ్చాడు.

"అవును, నాకంటే పెద్దవాడివిగా. నాకు ఇరవైనాలుగు, నీకు ఇరవై ఐదు. నువ్వు అలిగి వెళ్లిపోయాక ఏ రోజైనా నా ప్రేమ గురించి తిరిగి వస్తావని తెలిసే ప్రతీరోజూ భోజనం రెడీగా పెడుతున్నాను, పక్క సిద్ధం చేసి పెడుతున్నాను."

తనతో మాట్లాడే వ్యక్తి ఉన్మాది అని ప్రతాప్‌కు తెలిసింది, తెలియగానే భయం వేసింది.

"విమల కూడా పక్క రెడీ చేసిందేమో, వెళ్లి చూడనా?" అన్నాడు ఆ గదిలోంచి ఎలాగైనా బయటపడడానికి కారణం వెతుకుతూ.

"దాని మొహం, మొన్న వచ్చినవాడినే నువ్వనుకొని తన దగ్గరే ఉంచేసుకొంది. దాని ప్రేమ నిజమైనదే అయితే నిన్నెందుకు గుర్తుపట్టలేదు చెప్పు?"

"పోనీ నువ్వు చెప్పలేకపోయావా?"

"నేనెలా చెప్తాను? మాకు మాటలు పోయాయిగా. నువ్వెళ్లిపోయాక మా ఇద్దరిమధ్య పెద్ద గొడవయింది. నిన్ను ఆటలు పట్టించాలన్న అయిడియా నీదంటే, నీదేనని కొట్లాడుకున్నాం. అప్పట్నుంచీ



అమ్మా, నాన్నా అందరూ పోయి, మేం ఇద్దరమే మిగిలినా సరే, మేం ఒకరితో ఒకరు మాట్లాడుకోలేదు.."

ప్రతాప్ గుండె జారిపోయింది. ఇది ఖచ్చితంగా పిచ్చి వ్యవహారమే. దీంట్లోంచి బయటపడడం ఎలా? అని ఆలోచిస్తూన్నంతలో కమల పరుపు మీద నుండి చాకు దొరకబుచ్చుకుని చటుక్కున ఎత్తి పొడవబోయింది. ప్రతాప్ కుక్క ఎగిరి ఆమె మణికట్టుని పట్టుకుంది. కమల చాకు వదలలేదు. "...అందుకే మళ్లీ నువ్వెళ్లి పోకుండా ఉండాలంటే ఒకటే మార్గం. నువ్విలాగే ఉండిపోవాలి. నేను నిన్ను వదులుకోలేను." అంటూ కత్తి తన పిడికిలిలోంచి జారిపోకుండా ఆమె ప్రతాప్ గుండెలమీదకు తెస్తోంది. ప్రతాప్‌కి ఒక్కటే దారి తోచింది.

"కమలా, నేనే రాజానని నువ్వు కనిపెట్టినందుకు ఎంత సంతోషంగా ఉందో తెలుసా?" అన్నాడు గొంతులో మాధుర్యం నింపుకొని. కమల కళ్లనిండా ఆనందం. "నిజంగానా" అంది కానీ చాకు వదిలిపెట్టలేదు.

"నేను నీ దగ్గరే ఉండిపోవాలంటే ఆ చాకు పదును చాలదు. నా దగ్గర ఉన్నది తీసుకో" అంటూ ఆమెను మీదకు లాక్కున్నాడు. ఆమె చాకు వదిలేసింది, అతని కౌగిలిలో చిక్కుకుపోయింది. ప్రతాప్ తియ్యటిమాటలు చెబుతూ ఆమెను ఆక్రమించుకున్నాడు. పురుషస్పర్శ ఎరగని ఆ కన్యకు ఏం జరుగుతోందో తెలిసేలోగా ఆనంద పారవశ్యంలో ఆమె కళ్లు మూతలు పడ్డాయి. ఆమె గాఢనిద్రలోకి జారుకుంది.

ఆమె నిద్రపోయిందని రూఢి పరుచుకున్న గంట తర్వాత ప్రతాప్ పక్కమీద నుంచి లేచాడు. కుక్కకు సైగ చేసి, చప్పుడు చేయకుండా బయటకు వచ్చాడు. వరండాలో నుండి మెట్ల దగ్గరికి వస్తూండగా ఒక గదిలో సన్నటి కాంతి కనబడింది. విమల కుర్చీలో కూర్చుని ఉంది. మంచం మీద ఒక వ్యక్తి పడుకుని ఉన్నట్టుంది.

బయట వర్షం పూర్తిగా తగ్గలేదు. తుప్పర పడుతోంది. ప్రతాప్ నడక సాగించేడు. చలి గుర్తుకు రాలేదు. తెల్లవారేసరికి అనుకోకుండా కొండదేవరపాలెం తగిలింది. పోలీస్ ఔట్ స్టేషన్ సులభంగానే దొరికింది. ఎస్పీ సలహాను లక్ష్యపెట్టదలచుకొనలేదు ప్రతాప్. రత్తయ్య మాట దేవుడెరుగు, విమల గదిలో ఉన్నవాడిని రక్షించాలి. వెళ్లి ఇన్‌స్పెక్టర్ని లేపాడు. తనెవరో చెప్పాడు.

ఎనిమిదిగంటలయ్యేసరికి ఇన్‌స్పెక్టరు, ప్రతాప్, డాక్టరు, మరో ఇద్దరు కానిస్టేబుళ్లు ఆ సౌధం ముందున్నారు. తలుపు తట్టగానే కమలే తలుపు తీసింది. 'రాజా' అంటూ దగ్గరకు రాబోయింది. తక్కినవాళ్లను చూసి తమాయించుకొంది.

"విమలేది, కమలా?" అన్నాడు ప్రతాప్ ఆమె భుజం మీద చెయ్యేసి.

"అదుగో, తన పడగ్గదిలోనే ఉంది. నువ్వెళ్లి 'నేను రాజానే, వెర్రిమొద్దూ' అని చెప్పేయి. ఏమంటుందో చూద్దాం." అంది హుషారుగా.

అందరూ మేడమీద విమల గదిలోకి వెళ్లారు. గదంతా దుర్వాసన. విమల నిశ్చలంగా కూర్చుని ఉంది. వీళ్లని చూసి "ష్, డిస్టర్బ్ చేయకండి, రాజా నిద్ర పోతున్నాడు" అంది. మంచంమీద ఒక శవం పడి వుంది. గుండెల్లో బాకు. డాక్టరు చూస్తూనే, "మరణించి నాలుగైదు రోజులయివుంటుంది. ఎవరో అభాగ్యుడు. దారి తప్పి ఈ పిచ్చివాళ్ల పాలబడ్డాడు. నిద్రలోనే చంపేసి ఉంటుంది. కుర్రవాడిలాగే ఉన్నాడు, ఏ ఊరో గానీ..." అన్నాడు.

"కానిస్టేబుల్, జీపులో తప్పిపోయినవాళ్ల గురించి రిపోర్టులున్న ఫైలుంటుంది. వెళ్లి తీసుకురా" అన్నాడు ఇన్‌స్పెక్టర్.

"అక్కర్లేదు, నాకు తెలుసు, ఆ శవం రత్తయ్యది." అన్నాడు ప్రతాప్.